అక్రమంగా నిర్మిస్తున్న భవనం సీజ్



టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేసిన భవనం

నాంపల్లి: నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనాన్ని జీహెచ్ఎంసీ సర్కిల్–12 టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం సీజ్ చేశారు. మల్లెపల్లి డివిజన్‌లోని సీతారామ్‌భాగ్ పాత ముంబాయి హైవే ప్రధాన రోడ్డులో అక్రమంగా ఆరు అంతస్తుల భవన నిర్మాణం చేపడుతున్నారని స్థానికుల ఫిర్యాదు మేరకు గతంలో అధికారులు నోటీసులు జారీ చేశారు. వరుసగా 3 నోటీసులు జారీ చేసినా ఎలాంటి సమాధానం ఇవ్వకపోవడంతో జీహెచ్ఎంసీ అధికారులు భవనాన్ని సీజ్ చేశారు.

మానవ హక్కుల పరిరక్షణకు కృషి



కేక్ కట్ చేస్తున్న చైర్మన్ మహ్మద్ నజీబ్

గోల్కొండ: మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నామని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. ఆర్గనైజేషన్ ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా టోలిచౌకీలోని ఐహెచ్ఆర్‌వో కార్యాలయంలో బుధవారం సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మహ్మద్ సమీర్, షహబాజ్‌ఖాన్, మహ్మద్ ఇమ్రాన్ అబీబ్, తౌఫిక్, ఆమేద్ అలీ కురేషి, ఖాలీద్ నవాజ్, షఫీ, అబ్దుల్ తదితరులు ఉన్నారు.

డిగ్రీ విద్యార్థులకు 'వన్ టైం చాన్స్'

చార్మినార్: డిగ్రీ ఫెయిలైన విద్యార్థులకు ప్రభుత్వ సిటీ కాలేజీ సువర్ణావకాశం కల్పిస్తున్నదని ప్రిన్సిపాల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2007–19 మధ్య డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ చదివి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులను పూర్తి చేయలేకపోయిన విద్యార్థులకు వన్ టైం చాన్స్ ఇస్తున్నట్లు ఎగ్జామినేషన్ బ్రాంచ్ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సాధారణ పరీక్ష రుసుంతో పాటు నిర్ణీత అదనపు రుసుమును కూడా చెల్లించాల్సి ఉంటుందన్నారు. రుసుం చెల్లించి, దరఖాస్తు అందించేందుకు ఈనెల 12 చివరి తేదీ అని.. రూ.500 ఆలస్య రుసుంతో 18 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు కాలేజీ వెబ్‌సైట్ చూడాలని లేదా కాలేజీలో సంప్రదించాలని సూచించారు.

ఎఫ్‌టీసీసీఐ ఉపాధ్యక్షుడి ఎన్నిక



గరిమెళ్ల శ్రీనివాస్

నాంపల్లి: రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో బుధవారం జరిగిన చాంబర్ మేనేజింగ్ కమిటీ సమావేశంలో తెలంగాణ వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య (ఎఫ్‌టీసీసీఐ) ఉపాధ్యక్షుడిగా గరిమెళ్ల శ్రీనివాస్‌ను ఎన్నికున్నారు. పారిశ్రామికవేత్త అయిన శ్రీనివాస్‌కు ఎఫ్‌టీసీసీఐతో అనుబంధం ఉంది. పారిశ్రామిక అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా సహా పలు హోదాల్లో పని చేస్తున్నారు. ప్రస్తుతం జపనీస్ బహుళజాతి సంస్థ 'డీపీ ఐఎఫ్‌యూకేయూ'కు భారతీయ విభాగమైన ఇంట్రాలాజిస్టిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్‌గా పని చేస్తున్నారు.

విగ్రహ పున:ప్రతిష్ఠాపన మహోత్సవం

డబీర్‌పురా: బోధిఅలీషా కిడికి ప్రాంతంలోని కిడికి మైసమ్మ ఆలయంలో విగ్రహ పున:ప్రతిష్ఠాపన మహోత్సవ బుధవారం ప్రారంభమైంది. ముందుగా చండీహోమం..అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ రాచకొండ రవీందర్, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. గురువారం (నేడు) మధ్యాహ్నం 1 గంటకు అన్నదానం ఉంటుందని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

వీజీ పురుషోత్తమ్ సేవలు చిరస్మరణీయం



అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీజీ పురుషోత్తమ్ సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు పేర్కొన్నారు. బేగంబజార్‌లోని ఆయన నివాసంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే రాజాసింగ్, ఎమ్మార్పీఎస్ నాయకులు పూజలోల రవి, శివ మాదిగ, శ్రీనివాస్ మాదిగ, బాలసాయి మాదిగతో పాటు పలువురు నాయకులు పురుషోత్తం చేసిన సేవలు కొనియాడారు.



వైభవంగా లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం



విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ దాయిబాగ్‌లో గల ప్రసిద్ధ హనుమాన్ బాలాజీ మందిరం 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం వేద పండితుడు వేదాంతం రాజనర్సింహాచార్యుల ఆధ్వర్యంలో యజ్ఞాచార్యులు గోవర్ధన్ కార్తీక్ ఆచార్యతో పాటు ఇతర పండితులు లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆసిఫ్‌నగర్, శంకర్‌నగర్, జీబాబాగ్, విజయనగర్‌కాలనీ, కార్వాన్, సబ్జిమండి, మురాద్‌నగర్, మల్లెపల్లి, సీతారాంబాగ్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం 5 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, ద్వారతోరణ పూజ, నిత్యహవనం, నిత్య పూర్ణాహుతి, బలిహరణం, మంగళ శాసనం తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు కమిటీ అధ్యక్షుడు పి.సత్యంచారి, బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షుడు గొరిగె శ్రీనివాస్, కోశాధికారి సామల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బి.రమేశ్‌కుమార్, సహాయ కార్యదర్శి దాస శ్రీనివాస్, పుప్పాల సుదర్శనం, పూజోలు అంజయ్య యాదవ్, జి.వెంకటేశ్ గౌడ్, జ్ఞానేశ్వర్ షిండే, శ్రీనివాస్ మేస్త్రీ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



క్విజ్ పోటీల విజేతలకు సర్టిఫికెట్లు ఇస్తున్న దృశ్యం

చార్మినార్: సిటీ కాలేజీ ఎన్‌సీసీ, డ్రగ్, ర్యాగింగ్ నివారణ కమిటీ, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో కళాశాలలోని విద్యార్థులకు బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథులుగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ కేవీఎం ప్రసాద్, ఎస్ఐ చందన హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. సోషల్ మీడియా, ఫేక్ లింకులు, డేటా హ్యాకింగ్ వంటి మార్గాల ద్వారా నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. మోసానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.విప్లవ్ దత్ శుక్లా మాట్లాడుతూ.. 'సైబర్ నేరాలపై యువతకు అవగాహన చాలా ముఖ్యమని, ఇవి వ్యక్తిగత డేటా చౌర్యం, ఆన్‌లైన్ మోసాల వంటి నేరాల నివారణకు సహాయపడతాయని అన్నారు. ఎస్ఐ చందన సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులకు క్విజ్, స్కిట్, పోస్టర్ మేకింగ్ నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎన్‌సీసీ, డ్రగ్, ర్యాగింగ్ నివారణ కమిటీ కన్వీనర్ లెఫ్టినెంట్ డా.ఎస్.పి.కృష్ణవేణి సమన్వయం చేశారు. కార్యక్రమంలో హయ్యర్ ఎడ్యుకేషన్ యాంటీ డ్రగ్ అధికారి అన్నపూర్ణ, డా.శంకర్ కుమార్, డా.భాస్కర్, డా.ఆనంద్, డా.శ్రీదేవి, డా.సంతోష్ కుమార్, డా.తిరుపతి, పీసీ నవీన్, ఎన్‌సీసీ కెడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ముస్లింల రిజర్వేషన్ కోసమే కాంగ్రెస్ ధర్నా'



మాట్లాడుతున్న గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఉమా మహేందర్ తదితరులు

జియాగూడ: ఢిల్లీలో కాంగ్రెస్ చేపట్టిన ధర్నా బీసీల హక్కుల పరిరక్షణకు కాదని ముస్లింల రిజర్వేషన్ కోసమే చేసిందని గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఉమా మహేందర్, జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్ పేర్కొన్నారు. జియాగూడలోని కార్పొరేటర్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ హామీనిచ్చి అందులో 10 శాతం రిజర్వేషన్లు ముస్లింలకు కట్టబెట్టాలని చూస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ బీసీలను మోసం చేసిందని, ఆ ధర్నాకు బీసీల మద్దతు కరువైందన్నారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో బీసీలను ఎప్పుడూ గుర్తించలేదన్నారు. కార్యక్రమంలో గోల్కొండ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రాజేందర్ డెగాన్, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కట్ట నర్సింగ్‌రావు, సీనియర్ నాయకులు మనీష్ జైన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

'ఆల్ మీజాన్'కు బెస్ట్ సర్వీస్ అవార్డు



సాక్షి,సిటీబ్యూరో: కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన మాసాబ్‌ట్యాంక్‌లోని ఆల్ మీజాన్ టూర్స్ అండ్ ట్రావెల్స్‌కు బెస్ట్ సర్వీస్ అవార్డు వరించింది. సౌదీ ప్రభుత్వం నిర్వహిస్తున్న సౌత్ ఏషియా డివిజన్ ద్వారా హజ్ అండ్ ఉమ్రా సర్వీస్ విభాగంలో అత్యుత్తమ సేవలకు గాను బెస్ట్ సర్వీస్ అవార్డును అందజేశారు. అలాగే సంస్థ చైర్మన్ ఫయ్యాజ్ అలీకి పూలమాల వేసి సత్కరించారు. కార్యక్రమంలో సౌదీ ప్రభుత్వ ప్రతినిధి ఉస్మాన్ బిన్ మహఫూజ్, మీర్జా ఖుదురత్ బేగ్, హఫీజ్ అంజద్, మహ్మద్ నసీరుద్దీన్, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే చర్యలు

సుల్తాన్‌బజార్: మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సుల్తాన్‌బజార్ ఏసీపీ శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాంబాబు హెచ్చరించారు. సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన 51 మంది మందుబాబులను నాంపల్లిలోని 8వ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఎదుట బుధవారం హాజరుపరిచారు. మద్యం తాగి రెండోసారి పట్టుబడిన 14 మందికి 3 రోజుల జైలు, మూడో సారి పట్టుబడిన ఒక్కరికి 5 రోజుల జైలు శిక్ష విధించారు. 36 మందికి 2100 చొప్పున, 14 మందికి రూ.3300 చొప్పున ఒకరికి రూ.300 చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారని తెలిపారు. మొత్తం రూ.1,22,100 లక్షలు వసూలైనట్లు పోలీసులు పేర్కొన్నారు.

ముగిసిన క్రీడాపోటీలు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారం రోజులుగా జరుగుతున్న 11వ తెలంగాణ రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్ చాంపియన్ షిప్ క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జీ మహేశ్‌బాబు మాట్లాడుతూ.. వివిధ విభాగాల్లో బాల బాలికలకు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీఏఏ జాయింట్ సెక్రటరీ పీ వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.



టీమిండియా గెలుపుపై సంబురాలు



చార్మినార్: ఇంగ్లాండ్‌పై టీమిండియా గెలుపొందడంపై అభిమానులు మంగళవారం రాత్రి పాతబస్తీలో సంబురాలు చేసుకున్నారు. మదీనా సర్కిల్‌లోని మహ్మద్ క్యాప్ మార్ట్ వద్ద జాతీయ జెండాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలతో తమకున్న ప్రేమను చాటుకున్నారు. ఇటీవల డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గా బాధ్యతలు చేపట్టిన ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి స్వీట్లు తినిపించారు.

ఏకగ్రీవంగా ఎన్నిక

అఫ్జల్‌గంజ్: భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శిగా వీహెచ్‌పీ జాతీయ నాయకుడు డాక్టర్ రావినూతల శశిధర్ ఎన్నికయ్యారు. బేగంబజార్ బహితీభవన్‌లోని కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఉత్సవ సమితి అధ్యక్షుడు జి.రాఘవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ.. 27 నుంచి గణేశ్ నవరాత్రులు వైభవంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. హిందూ సంస్కృతిని పెంపొందించేందుకు పాటుపడతామని పేర్కొన్నారు.

రేపు మీరాలంమండిలో పూజలు

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో ఈనెల 8న ధన్వంతరి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. గత నెల 21న ఆలయంలో జరిగిన రంగం కార్యక్రమంలో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారన్నారు. ఆమె సూచన మేరకు ఉదయం 10 గంటలకు ధన్వంతరి పూజల్లో భాగంగా హోమం నిర్వహిస్తామని, అలాగే సాయంత్రం 7–05 గంటలకు సామూహిక వరలక్ష్మీ వ్రతం, పంచహారతి తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

ఘనంగా జాగృతి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



ఎమ్మెల్సీ కవితతో పుట్టి శ్రీనివాస్, పప్పు మాత్రే తదితరులు

అబిడ్స్: జాగృతి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన పప్పుమాత్రే, పుట్టి శ్రీనివాస్ పలువురు బీఆర్ఎస్ నాయకులు జాగృతి నేతలతో కలిసి హాజరయ్యారు. అలాగే ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను కూడా నిర్వహించారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్, కృష్ణ కిశోర్, దస్తగిరి అహ్మద్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్‌పై దాడి

చాంద్రాయణగుట్ట: ట్రాన్స్‌జెండర్‌పై దాడి జరిగిన ఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగులబండకు చెందిన గౌసియా (35) ట్రాన్స్‌జెండర్‌తో కలిసి ఫారూఖ్‌నగర్‌కు చెందిన నిసార్ (25) బ్యాండ్ మేళాలు వాయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. వీరిద్దరికీ సుమారు 4 ఏళ్ల పరిచయం ఉంది. దీంతో నిసార్ తరుచూ గౌసియా వద్దకు వచ్చి వెళ్తుండేవాడు. ఇదిలా ఉండగా బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఆమె తన ఇంటి నుంచి ఫలక్‌నుమా రైల్వేస్టేషన్ వైపు నడుచుకుంటూ వస్తుండగా వెనుక నుంచి వచ్చిన నిసార్ కత్తితో ఆమె గొంతు, కడుపు, చేతులపై దాడి చేసి పరారయ్యాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రక్తపు మడుగులో ఉన్న గౌసియాను చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దాడికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం



ఝాన్సీరాణి

గౌలిపురా: మహిళ అదృశ్యమైన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. గౌలిపురాకు చెందిన అఖిలేష్ కుమార్, ఝాన్సీ రాణి (40)లు దంపతులు. కాగా ఝాన్సీరాణి కొన్ని రోజులుగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. ఈ నెల 4న ఇంట్లోవారికి చెప్పకుండా ఝాన్సీరాణి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శశిరేఖ సాలీగ్రామ్‌కు డాక్టరేట్



శశిరేఖ సాలీగ్రామ్

సుల్తాన్‌బజార్: కాశీనాథుని విశ్వనాథ్ దర్శకత్వం వహించిన 4 చిత్రాల్లోని సామాజిక సమస్యలపై చేసిన పరిశోధనకు గాను ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని జర్నలిజం విభాగం శశిరేఖ సాలీగ్రామ్‌కు పీహెచ్‌డీ పట్టాను (డాక్టరేట్) ప్రదానం చేసింది. పూర్వ జర్నలిజం విభాగాధిపతి, యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర రావు ఈ పరిశోధనను పర్యవేక్షించారు. ఇందులో భాగంగా ఆమె వివిధ జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పరిశోధన పత్రాలు సమర్పించింది. ఆమె పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియాలో సభ్యురాలు. ఓయూ నుంచి డాక్టరేట్ పొందిన శశిరేఖను పలువురు జర్నలిస్టులు, పబ్లిక్ రిలేషన్స్ నిపుణులు, విద్యావేత్తలు స్కాలర్లు అభినందించారు.

ఘనంగా ప్రొఫెసర్ జయ శంకర్ జయంతి



జయ శంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వెంకన్న, ఎస్ఎండీ.సుభాని

నాంపల్లి: రెడ్‌హిల్స్‌లోని సింగరేణి భవన్‌లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూవ్‌మెంట్ బి.వెంకన్న, జనరల్ మేనేజర్ ఎస్‌డీఎం సుభాని హాజరై ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిచారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ..ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు తొలి, మలి దశ ఉద్యమాలకు దిక్సూచిగా, ప్రేరణగా నిలిచారని తెలంగాణ ప్రజల గుండెల్లో ఆయన ఎప్పటికీ నిలిచి ఉంటారని పేర్కొన్నారు. సుభాని మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర అస్థిత్వాన్ని సంస్కృతిని, రాష్ట్ర సాధన ఆవశ్యకతను జయ శంకర్ ఎంతో అవగాహనతో విపులంగా వివరిస్తూ ఉండేవారని, ఆయన స్ఫూర్తితోనే తెలంగాణ ఉద్యమం సాగిందని ప్రత్యేక తెలంగాణాను సాధించుకోవడమూ జరిగిందన్నారు. కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది నివాళులర్పించారు.



నర్కిపూల్ బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో ..

చార్మినార్: నర్కిపూల్ బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న అధికారులతో కలిసి జయ శంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ.. సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు జరిగిన అన్యాయంపై ప్రజలను జాగృతం చేసి అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ డి.శంకర్ సింగ్, టౌన్ ప్లానింగ్ సీపీ మహమ్మద్ అబ్దుల్ మాజీద్, ఏఎంసీ రాజారావు, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్ అందరివాడు



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ శాంతా సిన్హా ఆర్.నారాయణ మూర్తి

గన్‌ఫౌండ్రీ: ప్రజా గాయకుడు యుద్ధ నౌక గద్దర్ ఒక వర్గానికి చెందిన వ్యక్తి కాదు అని అన్ని వర్గాలకు కావాల్సిన వ్యక్తి అని పలువురు ప్రముఖులు అన్నారు. గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో బుధవారం గద్దర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ.. గద్దర్ తన ఆట, పాట, మాటలతో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేశారన్నారు. గద్దర్ పేరిట తెలంగాణ ప్రభుత్వం సినిమా అవార్డులు సంతోషంగా ఉందని అయితే ఆ అవార్డులో గద్దర్ ఫొటో ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రొఫెసర్ శాంతా సిన్హా మాట్లాడుతూ.. గద్దర్ ఒక ఉద్యమ శక్తి అన్నారు. గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సూర్యం మాట్లాడుతూ.. గద్దర్ స్మృతివనం, కళాక్షేత్రాన్ని త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. అనంతరం గద్దర్ రచించిన నాపల్లె, గద్దర్‌పై రాసిన పాటల పుస్తకాలను ఆవిష్కరించారు. అంతకు ముందు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ప్రజా గాయకుడు జయరాజు, సామాజిక వేత్త సజయ, ఫౌండేషన్ ప్రతినిధులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన 'బూట్ క్యాంప్'



ప్రశంసా పత్రాలతో విద్యార్థినులు, అధ్యాపకులు

గోల్కొండ: మెహిదీపట్నంలోని సెయింటాన్స్ మహిళా డిగ్రీ కళాశాలలో ఫిక్ సిటీ ఎడెక్స్ సహకారంతో 6 రోజుల పాటు సాగిన బూట్ క్యాంప్ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ఏ.విజయరాణి క్యాంప్‌లో ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలు అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఫ్రంట్ ఎండ్ టెక్నాలజీ బ్యాంకెండ్ అండ్ డేటాబెస్ అండ్ కోర్టింగ్ తదితర విషయాలను విద్యార్థినులు తెలుసుకున్నారన్నారు. కార్యక్రమంలో ఫుల్ స్టాగ్ డెవలపర్ అండ్ ట్రైనర్ పూజా తాహ్డేతో పాటు శృతిది, అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీకగా పాతబస్తీ

చార్మినార్: పాతబస్తీలో ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్యకుమార్ అన్నారు. మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకుని సౌత్ ఈస్ట్ జోన్ అదనపు డీసీపీ శ్రీకాంత్, ఏసీపీ వెంకట్‌రెడ్డి తదితరులతో కలిసి షెహజాదా అలీ అస్గర్ ఆషుర్‌ఖానాను బుధవారం సందర్శించి ఆలంలకు పూలు, దట్టీలు సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తదితరులు పాల్గొన్నారు.



బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి



అబిడ్స్: కేంద్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలో బుధవారం జరిగిన కాంగ్రెస్ ధర్నాకు గోషామహల్ నుంచి కార్యకర్తలు, నాయకులతో కలిసి తరలివెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీసీలను కేంద్రప్రభుత్వం దగా చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో శ్రీధర్ గౌడ్, కృష్ణకుమార్, యాదగిరి, చలం తదితరులు పాల్గొన్నారు.

అఫ్జల్‌గంజ్: గోషామహల్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంతోష్ గుప్తా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంతోష్ గుప్తా మాట్లాడుతూ.. రిజర్వేషన్ ఇచ్చేవరకు ఆందోళనలు చేపడుతామన్నారు.



ఆందోళనలో నిర్మల్‌కుమార్ యాదవ్ తదితరులు